www.teluguone.com

# ఆమె మార్గం స్త్రీ వాదం

(అబ్బూరి ఛాయాదేవి జీవిత చిత్రం)



తన మార్గమేమో తనది.
ఏ వాదాలనూ ఆమె అనుసరించలేదు.
చిన్నతనం నుంచి తను చూసినవీ, తను కొంతవరకూ అనుభవించినవీ, తనకు నచ్చనివీ రాశారు.
ఆ తర్వాతి కాలంలో ఆ రచనలకే తెలుగులో 'స్త్రీ వాద' రచనలుగా పేరొచ్చింది.
ఆ రచయిత్రి - అబ్బూరి ఛాయాదేవి.

స్త్రీ వాద రచనలు ఇంగ్లీషుతో పోలిస్తే తెలుగులో కొంత ఆలస్యంగా అడుగుపెట్టాయి.
ఏ ఎండకాగొడుగు అన్నట్టు ఏ వాదానిది కాలమైతే ఆ వాద రచనలు చేసే రచయితలు పుట్టుకొచ్చారు.
అయితే వారిని కానీ, స్త్రీ వాద రచయిత్రులుగా పేరుపొందిన వారు అనుసరించిన పద్ధతి కానీ ఛాయాదేవి అనుసరించలేదు.
మొదటి నుంచి ఆమె పద్ధతి ఆమెదే. ఆమె తరహా ఆమెదే.

తన మార్గమే తనది అనిపించుకుని, ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్‌కు ఎంపికైన అబ్బూరి ఛాయాదేవి జీవిత విశేషాలు, సాహిత్యం పై ఓ పరిచయ వ్యాసం.

ఛాయాదేవి 1933 అక్టోబర్ 13వ తేదీన జన్మించారు. ఛాయాదేవి అని ఆమెకు పేరుపెట్టడానికి ఓ కథ ఉంది. ఆమె తల్లిదండ్రులకు మూడవ సంతానం. ఈ సంతానం మగపిల్లవాడు కావాలని కోరుకుంటూ సూర్యనమస్కారాలు చేశారు. కానీ పుట్టింది ఆడపిల్ల. సూర్యభగవానుడి భార్య పేరు- ఛాయాదేవి అని ఆమెకు పేరుపెట్టారు. ఛాయాదేవికి ఒక అక్క. ఒక అన్న. అక్క ఆమెకన్నా తొమ్మిదేళ్ళు పెద్ద.
ఛాయాదేవి తండ్రి న్యాయవాద వృత్తిలో ఉండేవారు. "క్రమశిక్షణ పేరుతో ఆడపిల్లలను మరీ అదుపులో ఉంచడం, బ్రాహ్మణ కుటుంబాలలో ఉండే ఆచారాలు, సంప్రదాయాలు, ఛాందసం తనను స్త్రీ స్వాతంత్ర్యం వైపు ఆకర్షితురాలిని చేశాయి, అవే రచనలు చేయడానికి ప్రోత్సాహమిచ్చాయి" అని చెబుతారామె. అయితే అనీబిసెంట్ వంటివారితో ఆమె తండ్రికి కలిగిన పరిచయాలు ఆమె కుటుంబ వాతావరణంలో కొద్దిగా మార్పు తెచ్చాయి.
నచ్చిన చీర కొనుక్కోవడానికి కూడా స్వతంత్రం లేని కుటుంబం ఆమెది. తల్లికి కావలసిన చీరలు తండ్రి కొనుక్కురావడం, అందులో తల్లి ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యం లేకపోవడం ఛాయాదేవిని బాధించేవి. ఈ వాతావరణంలో ఆమెకు ప్రోత్సాహం అన్న నుంచి లభించింది. తను చదువు నేర్చుకోవడానికి గల కారణాలు వివరిస్తూ - "నా చేతిలో విద్యారేఖ ఉందని చెప్పడంతో మగపిల్లాడయితే చదువు చెప్పించనా అని నాకు చదువు చెప్పించడం ప్రారంభించారు. మగపిల్లవాడిని పెంచినట్లే పెంచారు. చొక్కాలు లాగూలు వేసేవారు" అని చెప్పారామె.
అన్న గోపాలకృష్ణ ప్రోత్సాహం, ఉన్నతవిద్య గురించి చెబుతూ- "నేను బి.ఎస్‌సిలో ఉండగా ఒక సంబంధం చూశారు. తాంబూలాలు పుచ్చుకున్న తర్వాత అది ఎందుకో తప్పిపోయింది. ఇంక రాజమండ్రిలో ఉంటే బాగుండదనిపించి అన్నయ్య నన్ను హైదరాబాద్ తీసుకువచ్చారు. అప్పుడక్కడ రిజనల్ రీసర్చ్ ల్యాబ్స్‌లో సైంటిస్ట్‌గా పనిచేసేవాడతను. అతనే నన్ను నిజాం కళాశాలలో ఎం.ఎలో
చేర్పించాడు.

కుటుంబవాతావరణమే ఛాయాదేవిగారిలో స్త్రీవాద తరహా భావాలకు బీజం వేశాయని ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఆ కారణాలేమిటో వివరిస్తూ - "మా అమ్మకు అసలు స్వాతంత్ర్యం లేదు. కరివేపాకు కొనాలన్నా కాణీ కోసం భర్తను అడగాలని మా అమ్మ వాపోయేది. అది నా మనసు మీద బాగా బలమైన ముద్ర వేసింది. అన్నీ సమకూరుస్తున్నా కదా, ఇంకా ఆడవాళ్ళ దగ్గర డబ్బు ఎందుకు అన్నది నాన్నగారి వాదన. ఆడవాళ్ళకి అప్పట్లో స్వాతంత్ర్యమే లేదు. ఆర్థిక స్వాతంత్ర్యం అసలు లేదు. అప్పట్లో రేడియోలో నేను రాసిన నాటకమన్నా, ప్రసంగమన్నా ప్రసారమైతే 25 రూపాయలు లేదా 15 రూపాయలు వచ్చేవి. అవి స్వార్జితం కదా! వాటితో ఇష్టం వచ్చినవి కొనుక్కునేదాన్ని. ఎవరికన్నా బహుమతులు కొనడానికి ఉపయోగించేదాన్ని. బ్యాంక్ ఎకౌంట్ కూడా తెరిచాను. ఎం.ఎ.ఫైనల్‌లో ఉండగా 'భర్తను ఎంచుకోవడం ఎలా?" అనే అంశం మీద రేడియోలో ప్రసంగించే అవకాశం కలిగింది. భాస్కరభట్ల కృష్ణారావుగారు ఆ అవకాశం ఇచ్చారు. స్త్రీలకు మామూలు స్వేచ్ఛే లేదు. ఇక భర్తను ఎంచుకునేంత స్వేచ్ఛ ఎక్కడిది? వరకట్నం తీసుకునేవారిని పెళ్ళి చేసుకోకూడదు. ఆడపిల్లలు పెళ్ళే పరమార్థం అనుకోకూడదు. అలాగే ఎవరినీ గుడ్డిగా ప్రేమించకూడదు. పెద్దవాళ్ళు ఏదైనా చెబితే అది పిల్లల మంచి కోసమే చెబుతారు. వారి ఆలోచనలు పిల్లల బాగు కోరేవిగానే ఉంటాయి" అని మాట్లాడాను.

కట్నం తీసుకోనివాడినే పెళ్ళిచేసుకోవాలి అని ఆమె ఆ ప్రసంగంలో వ్యక్తం చేసిన అభిప్రాయాన్నే బలంగా నమ్మారామె. ఆమెకు పరిచయమున్న అబ్బూరి వరద రాజేశ్వరరావు అటువంటి వ్యక్తే . ఆయనే జీవిత సహచరుడయ్యాడు. వివాహం గురించి మాట్లాడుతూ- అబ్బూరి వరద రాజేశ్వరరావు మా అన్నయ్య సహాధ్యాయి. అన్నయ్య బి.ఎస్‌సి. అయితే ఈయన బి.ఎ. ఆనర్స్. ఒకే విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. భాస్కరభట్ల కృష్ణారాయి, వరద రాజేశ్వరరావు స్నేహితులు. మాది పెద్దవాళ్ళు కుదిర్చిన సంబంధంలా కాకుండా నా వ్యక్తిత్వం, నా సాహిత్యాభిలాష వల్ల కుదిరిన సంబంధం కావడం నాకు గర్వకారణం"

సహజంగానే సాహిత్యాభిలాష ఉన్న ఛాయాదేవి రేడియో నాటకాల ద్వారా తన భావాలను మొట్టమొదటిగా వివరించినా 1954లో శ్రీశ్రీ, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వరరావు కలిసి స్థాపించిన 'కవిత' అనే పత్రికకు ఎడిటర్‌గా తనలోని సాహితీ పిపాసను చాటిచెప్పారు. ఆ పత్రికలో మాత్రాఛందస్సులో రాసిన కవిత ఆ పత్రికలో ప్రచురితమైంది. ఏడాదికి మూడు సంచికలు తీసుకురావాలనుకున్నా ఛాయాదేవి, రాజేశ్వరరావు దంపతులు ఢిల్లీ వెళ్ళిపోవడంతో ఆ పత్రిక ఆగిపోయింది. ఎడిటర్‌గా ఆమె మరో పత్రిక కూడా తీసుకువచ్చారు. 1955లో వరదరాజేశ్వరరావు సిర్‌పూర్ కాగజ్ మిల్స్‌లో పనిచేస్తున్న సమయంలో వనిత మాసపత్రిక ఎడిటింగ్, ప్రచురణ బాధ్యతలు నిర్వహించారు. మహిళా సమస్యల మీద వచ్చిన పత్రిక అది.కేవలం ఏడాదిపాటే నడిచింది. నాయని కృష్ణకుమారి, తురగా జానకిరాణి వంటి రచయిత్రుల రచనలు ఆ పత్రికలో వచ్చాయి.

పత్రికను కేవలం కాలక్షేపానికి కాక అభిరుచితో తీసుకురావడంతో ఆ పత్రికకు గుర్తింపు బాగానే వచ్చింది. అయితే పిల్లలు కలగకపోవడంతో నిస్పృహ కలగకపోయినా, వ్యాపకం కోసం లైబ్రరీసైన్సెస్ చదివారు. ఢిల్లీ వెళ్ళిన సమయంలో రక్షణ శాఖ వారి గ్రంథాలయంలో ఆమెకు ఉద్యోగం దొరికింది. ప్రైవేట్ లైబ్రరి ఆఫ్‌ది డిఫెన్స్ సర్వీసెస్ అండ్‌అ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అనే లైబ్రరీ కావడానికి పెద్దదే అయినా తక్కువ సిబ్బంది. తర్వాత స్నేహితుల సలహా మేరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ వారి సంయుక్త రిసర్చ్ లైబ్రరిలో చేరారు.. తరాత ఇండియన్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో ప్రొఫెషనల్ అసిస్టెంట్‌గా చేరారు. అక్కడే పనిచేస్తూ గ్రంథాలయాధికారిగా డాక్యుమెంటేషన్ స్టడీస్ కోసం 1976-77లో ఫ్రాన్స్‌లో పర్యటించారామె ఇవన్నీ ఆమెకు ఎంతో ఉపకరించాయి.


రచయితగా ఆమెకు గుర్తింపు తెచ్చిన రచనలను గురించి చెబుతూ- " జ్యోతి మాసపత్రిక కోసం ప్రయాణం అనే పెద్ద కథ రాశాను. ఆ పత్రికకు కథ రాస్తే కథకు బాపు బొమ్మలు వస్తాయనే ఆశకొద్దీ రాశానవి. అది ఆ పత్రికలో సిరియల్‌గా వచ్చింది

తర్వాత మహిళా సమస్యలు ప్రధానంగా రచనా వ్యాసంగం నిర్విఘ్నంగా కొనసాగింది. భార్య అంటే భర్త చుట్టూ తిరిగే ఉపగ్రహం అనే భావంతో 'ఉపగ్రహం' అనే కథ రాశాను. స్త్రీకి విశ్రాంతి అవసరం అనే కోణంలో 'సుఖాంతం' రాశాను. ఈ కథలో కథానాయకి చివరికి నిద్రకోసం నిద్రమాత్రలు వేసుకోవడానికి అలవాటు పడుతుంది. ఒకరోజు రాత్రి నిద్రమాత్ర తీసుకుంటూ ఉంటే మొత్తం మాత్రలు చేతిలో పడతాయి. వాటినిండా నిద్ర ఉంది అనుకుంటుంది. అవన్నీ వేసుకుంటే ఎంత బాగా నిద్రపడుతుంది అనుకుంటుంది కోడి కునుకులాంటి కునుకు నాకు వద్దు. తృప్తిగా నిద్రపోవాలని అనుకుంటుంది. "ఏండీ ఆత్మహత్య చేసుకుంటున్నానని అపార్థం చేసుకోవద్దు. కేవలం నిద్ర కోసమే నిద్రపోతున్నాను" అని భర్తనుద్దేశించి చీటీ రాసేసి చనిపోతుంది. స్థూలంగా ఇదీ సుఖాంతం కథ.
నేషనల్ బుక్ ట్రస్ట్‌వారి కథా సంకలనంలో ఈ కథకూ స్థానం లభించింది 'శ్రీమతి ఉద్యోగిని' అనే కథ కూడా రాశాను. మగవాడి పెంపకంలో ఉన్న తేడా వల్లే ఆడదాని జీవితం బొన్సాయ్ మొక్కలా మారింది అనే భాగంలో ఢిల్లీలో ఉన్నప్పుడు 'బొన్సాయ్ బతుకు' రాశాను. అమ్మానాన్నలకు మొత్తం పదిమంది పుట్టారు. సరైన పోషణ, వైద్యం లేక ఆరుగురు చనిపోయారు. మా అమ్మ, అక్కల కష్టాలు బొన్సాయ్ బతుకులో ప్రతిఫలిస్తాయి. ఇది సాహిత్య అకాడమీ వారి కథా సంకలనంలో చోటు చేసుకుంది..

రచయిత్రిగా ఛాయాదేవి ఎన్నోపురస్కారాలు అందుకున్నారు. మృత్యుంజయ పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ రచనా పురస్కారము, ఇంకా సుశీలా నారాయణరెడ్డి అవార్డు, కళాసాగర్ అవార్డు, వాసిరెడ్డి రంగనాయకమ్మ అవార్డు, తాజాగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.

ఆ పురస్కారానికి ఛాయాదేవి ఎంపికైన తర్వాత వివిధ పత్రికలలో వచ్చిన వాసాలివి.

## తనమార్గం' ఉత్తమం




అబ్బూరి ఛాయాదేవిగారి 'తనమార్గం' ఉత్తమ కథా సంకలనంగా కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొంది రచయితలను, ముఖ్యంగా రచయిత్రులనుఆనందపెట్టింది. చాలా సంవత్సరాల తర్వాత రచయిత్రులకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందనే సంతోషం అందరిలోనూ కలిగింది. ఛాయాదేవిగారికి అవార్డు వచ్చిందంటే మనందరికీ వచ్చినట్టే అని పాటిబండ్ల రజని, నిర్మల, శిలాలోలిత, పి. సత్యవతి, కె.బి. లక్ష్మి, కె. సత్యవతి ఇలా ఎందరోఆనందించారు. దాని కి కారణం ఈ కథా సంకలనంలోని 28 కథల సారాంశం, ఈకథలన్నీ స్త్రీలను తమ అస్తిత్వాలను గురించి

ప్రశ్నించుకోమని చెప్పేవి. చలంఅంటాడు ఔన్నత్యాన్ని సాధించటానికైనా, సర్వనాశనం కావటానికైనా స్త్రీకి స్వేచ్ఛ కావాలని. ఔను. స్త్రీలకు తమ మార్గం తమకుండాలి. తమ జీవనపథాలను తాము నిర్మించుకోవాలి. తరతరాల సంప్రదాయాల ఆచరాల దారిలో నడిస్తే మన కథలు 'సుఖాంతం' కావు. మన జీవితాలు కుంచించుకుపోయి 'బోన్‌సాయ్ బతుకులు' ఔతాయి.

స్త్రీ ల జీవన'ప్రయాణం'లో ఎన్నో దెబ్బలు తగులుతాయి. గాయాలు రక్తాలు తప్పవు. కానీ వాటిని ప్రాణాంతకంగా పరిగణించకుండా కోలుకుని ప్రయాణం కొనసాగించి గమ్యం చేరుకోవాలని చెప్తాయి ఛాయాదేవి గారి కథలు. స్త్రీల

అణచివేతలోని మారుమూల కోణాలపై ఈ కథలు వెలుగు ప్రసరిస్తాయి. కర్కశమైన అణచివేతను నిజాయితీగా, సూటిగా ప్రశ్నిస్తాయి. సున్నితంగా అడిగినట్లు కన్పిం చినా ఆ ప్రశ్నలలోని సత్యాగ్రహం వాడిగా వేడిగా పాఠకులకు తగులుతుంది.

తెలుగు కథకులలో ఛాయాదేవిగారిదొక ప్రత్యేక స్థానం. ఏదో సామాన్యమైన సంఘటనను చెప్తున్నట్లు చెప్తూ ఆమె జండర్ వివక్ష మూలాలను కదిలిస్తారు. సున్నితమైన హాస్యంతో, వ్యంగ్యంతో శత్రు పక్షంవారు తలదించుకునేలా చేస్తాయి ఛాయాదేవిగారి కథలు. ఈ 28 కథలలోని ఆలోచనలన్నీ అధునాతనమైనవి. స్త్రీలకు కనువిప్పు కలిగించి ముందుకు నడిపించేవి. సాధారణ మానవుల జీవితానుభవాలను, అందరికీ తెలిసిన వాటిని చెప్తున్నట్లే చెప్తూ పాఠకులకు తెలియకుండానే తనమార్గంలోకి లాక్కెళ్ళే రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి. ఆ మార్గంలోని దృష్టి కోణం అర్థమైందంటే ఎవరి మార్గం వారు వెతుక్కునే స్ఫూర్తి కలుగుతుంది.

కుటుంబంలో జండర్ విధానం అమలయ్యే తీరునామె బోన్‌సాయ్ చెట్టు ప్రతీకతో చెప్పిన తీరు అపూర్వం. బోన్‌సాయ్ చెట్టును
పెంచిన విద్యాధికురాలితో, చదువులేని ఆమె అక్క అంటుంది– 'నువ్వు అపురూపంగా పెంచిన నీ బోన్‌సాయ్ చూడు. చూట్టానికి కుదురుగా ముచ్చటగానే ఉంది. సంసార పక్షపు స్త్రీలాగా. కానీ ఎంత సుకుమారమో చూడు. నువ్వు వెయ్యి కళ్ళతో కాపాడాలి. దాన్ని. కాస్త తుపానుకు కూడా తట్టుకోలేదు. తనే ఒకరిమీద ఆధారపడి ఉన్నప్పుడు మరొకరికి నీడ ఏమివ్వగలదు. మగవాడికీ ఆడదానికీ పెంపకంలో ఉన్న తేడా వల్లనే కదుటే ఆడదాని బ్రతుక్కూడా బోన్‌సాయ్ మాదిరి అయింది' అని.

మగవాళ్ళ జీవితాల చుట్టూ తిరగటంలోనే తమ జీవితాలకు అర్థం ఉందనుకునే స్త్రీలకు ఛాయాదేవిగారు పెట్టిన పేరు 'ఉపగ్రహం'. మగవాడి చుట్టూ అతని దయాదాక్షిణ్యాల కోసం తిరిగే ఉపగ్రహాలు తమ గతిని మార్చుకోకపోతే కాంతిహీనులుగానే మిగిలిపోతారనే హెచ్చరించే కథ ఇది.




'ఒకసారి హాయిగా తృప్తిగా నిద్రపోయిన రోజు నాకు గుర్తు లేదు.
జీవితమంతా నిద్రకోసం మొహం వాచినట్లు అన్పిస్తుంది'
సుఖాంతంలోని స్త్రీ పాత్ర మాటలు లక్షలాది స్త్రీలు తమవే అనుకుంటారు.

'ప్రయాణం' కథలో రమ మీద స్నేహితురాలి భర్త అత్యాచారం చేస్తాడు. ప్రేమించిన మూర్తి ఆ విషయం విని తట్టుకోలేక దూరమవుతాడు. దీన్నంతా తట్టుకోలేక అందరికీ దూరంగా వెళ్ళిపోదామనుకున్నప్పుడు ఆమెను ప్రేమించిన శేఖరం అంటాడు
' మీ స్నేహితురాలి భర్త చేసిన పనిని మీరు యేవగించుకుంటున్నారు, రెండు కారణాల వల్ల. ఆ పని సాంఘిక నీతి నియమాలకు విరుద్ధం కావడం వల్లనూ, మీ మనసంతా మూర్తి వైపు మొగ్గి ఉండడం వల్లనూ. అవునా? మీరు కారులో రోడ్డుమీద పోతుంటే ఎదుటి నుంచి ఎవరో నియమాలకు వ్యతిరేకంగా కారు నడిపించుకుంటూ వచ్చి మీ కారుని ఢీ కొం

టాడు. మీకారు దెబ్బ తింటుంది. మీరు మాత్రం సరైన మార్గాన్నే, నియమబద్ధంగానే వెళ్ళారు. అయినా కారు పాడైంది. అక్కడ మీ మనస్సు నియమోల్లంఘనం గురించి బాధపడనవసరం లేదుగదా– కారుని బాగు చేయించుకుంటారు. అంతే.' రమని ఆలోచింపచేసిన ఈ మాటలు స్త్రీపురుషులందరూ నమ్మవలసిన మాటలు. 1965లోనే మాటలు ఛాయాదేవిగారు రాశారు. స్త్రీల శీలం, పవిత్రతల గురించి సంస్క?ృతి పేరుతో ఇప్పటికీ ఎన్నో గొడవలు జరుగుతున్న సందర్భంలో ఈ కథ ఉన్న సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం ఎంతో బాగుంది.

కుటుంబ హింసకు తోడు బైట సమాజంలో ఎదురయ్యే లైంగిక వేధింపులు స్త్రీలకు పెద్ద సమస్యగా ఉన్నాయి. పనిచేసే చోట లైంగిక వేధింపులపై సుప్రీంకోర్టు ఎంత మంచి తీర్పు ఇచ్చినా స్త్రీలకది తప్పటం లేదు. ఈ లైంగిక హింస, వేధింపుల వలయాన్ని గురించి రాసిన కథ కర్త–కర్మ–క్రియ. మాతృత్వం గురించి ఛాయాదేవిగారు రాసిన నాలుగు మంచి కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. ఉడ్‌రోజ్ కథలో అల్లుకుపోవటమే తెలిసిన తల్లి వ్యథను చిత్రించి, తనమార్గంలో తెంచుకుపోయే తెగు వ ఉన్న తల్లి వర్ధనమ్మను సృష్టించారు. కొడుకుల పెత్తనాన్నించి బైటపడి చిన్న చిన్న ఆనందాలను సైతం ఒంటరిగా హాయిగా అనుభవించగలిగిన మార్గాన్ని ఎంచుకున్న వర్ధనమ్మ పాత్ర అపురూపమైంది. మొగ్గ కథలో కొడుకు న్యాయమైన మార్గంలో ఉన్నాడనిపించినపుడు భర్తను ధిక్కరించిన తల్లి గురించి రాశారు. కుటుంబంలో తల్లి స్థానాన్ని అర్థం చేయించే కథ 'పరిధి దాటిన వేళ'. వయసు పెరిగే కొద్దీ తండ్రి స్పర్శకు దూరమయ్యే ఆడపిల్లల బాధా భావవీచికలను పట్టుకున్న 'స్పర్శ' కథ

ఛాయాదేవిగారే రాయగలిగినంత సున్నితమైన కథ. హాస్య, వ్యంగ్య ధోరణిలో రాయటం ఛాయాదేవిగారి ప్రత్యేకత. 'మూడునాళ్ళ ముచ్చట', 'రెండు కాదు ఇరవై రెండు' అలాంటి కథలు. కేవలం స్త్రీ సమస్యలే ఈ కథా సంకలనంలో ఉన్నాయనే అపవాదు రాకుండా 'ఆఖరికి ఐదు నక్షత్రాలు' ఆదుకుంటుంది. నిరాడంబరత, నిజాయితీలకు శైలీరూపం ఇస్తే అది ఛాయాదేవిగారి కథా కథన శిల్పమవుతుంది. పదునైన, హేతుబద్ధమైన భావాలు సరళమైన రీతిలో రాస్తారు. భాష ఎంతో హాయిగా చదివిస్తుంది. ఆంగ్ల పదాలు చాలా అరుదుగా వాడతారు. తెలుగు భాషను ఈమె వాడిన తీరువల్ల కథలకు చెప్పనలవిగాని సౌందర్యం వచ్చింది. హంగూ ఆర్భాటాలూ లేకుండా చెప్పడం వల్ల పాఠకులు ఆమె చెప్పే విషయాలను ప్రిజుడిస్ లేకుండా ఆలోచించగలుగుతారు. దానివల్ల కథా ప్రయోజనం సులభంగా నెరవేరుతుంది.

ఓల్గా (ఆంధ్రజ్యోతి)




చదవగానే కళ్ళు చెమ్మగిల్లాలి.
మనసున ఒక మెరపు మెరవాలి.
కొత్త ఆలోచన ఏదో స్ఫురణకు రావాలి.
హృదయపు తంత్రిని కదిలించాలి.
కథల తాలూకు అనుభవం తెలియకుండానే వెంటాడాలి.



అబ్బూరి ఛాయాదేవి రాసిన కథలు ఈ రీతిలోనే ఉంటాయి. తన సాహిత్య ప్రయాణంలో రాసిన కథలు తక్కువేనంటారు అబ్బూరి ఛాయాదేవి. కానీ ప్రతికథ కూడా ఆడవాళ్ళ జీవితంలోని భిన్న కోణాల్ని చూపుతుంది. ఇప్పుడు ఆమె కథా సంపుటి 'తన మార్గం' కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకుంది. ఈ కథా సంపుటిలో 28 కథలున్నాయి. స్త్రీ పురుష సంబంధాల్లోని వైరుధ్యాలు, సంఘర్షణలు ఆమె కథల్లో కనిపిస్తాయి. పితృస్వామ్య సమాజం ఆడవాళ్ళ జీవితాన్ని ఎలా నియంత్రిస్తుందో ఈ కథల్లో చెప్పారు. కుటుంబ జీవితంలో అవమానాలు, అణచివేతలు మామూలేననుకునే మధ్య తరగతి ఆడవాళ్ళని ఆలోచింపచేస్తాయి.

ఆడవాళ్ళు ఆత్మగౌరవంతో జీవించాలంటే ఆత్మవిశ్వాసంతో ఉండాలి. అందుకు ధైర్యంగా నిలబడగలగాలి. మనసులోని మాటను స్పష్టంగా చెప్పగలగాలి. ఇందుకు కావల్సిన మానసిక స్థైర్యాన్ని ఇస్తాయి అబ్బూరి ఛాయాదేవి కథలు. కుటుంబ జీవితం కాస్త హాయిగా, ఆనందంగా ఉండాలనుకుంటారు. జీవితాన్ని పంచుకునే మనిషి తనను అర్థం చేసుకోవాలనుకుంటారు. ఇవేమీ అత్యాశలు కావు. కానీ అహంకారం మూర్తీభవించిన మగ సమాజంలోని ఈ సాధారణమైన అంశాలే అసాధారణంగా కనిపిస్తాయి.

ప్రకృతి సుత్రాల ప్రకారం మగపిల్లలు, ఆడపిల్లలు పుడతారు. కానీమగపిల్లలు ఆధిక్యాన్ని ఆపాదించడం వల్లనే ఆడవాళ్ళ జీవితం ఆంక్షలమయమవుతుంది. ఈ విషయాన్ని స్ఫురింపచేస్తాయి ఛాయాదేవి కథలు. కనుకనే ఆమె కథలు చదవడం స్త్రీలకు ఒక ప్రత్యేకానుభవం.

స్త్రీల నిత్యజీవితంలో  ఉండే సమస్యలు, సంఘర్షణలు సంక్లిష్ట అనుభవాలను సునిశితమైన శైలిలో అనేక కథల్లో చిత్రించారు. ఆమె కథలు సామాజికంగా, కుటుంబరపరంగా స్త్రీ పురుషుల మధ్య ఉన్న సంబంధాలను ఆవిష్కరించిన తీరు ఆలోచింపచేస్తుంది. జీవితాన్ని స్త్రీల దృష్టికోణం నుంచి పరిశీలించే ఈ కథలు చదువుతుంటే ఆడవాళ్ళ మనస్సులోని సంఘర్షణలు కళ్ళముందు ప్రత్యక్షమయినట్లు ఉంటుంది.

తనని ప్రేమించే మనిషి కూడా తన ప్రమేయమ లేకుండా జరిగిపోయిన సంఘటన పట్ల సంప్రదాయిక పురుషుడి రీతిలోనే ఆలోచిస్తే స్త్రీ హృదయం తల్లడిల్లుతుంది. ఎవరో చేసిన గాయానికి జీవితమమతా అలాగే మిగిలిపోవాలనుకోవడం సంప్రదాయక సమాజం విధించిన న్యూనతాభావం ఫలితం. కానీ మగవాళ్ళలోనూ సంస్కారవంతులుంటారు. వారి చేయూత, ఆలోచనాధోరణి స్త్రీ జీవితాన్ని వెలిగిమచేస్తుంది. ఛాయాదేవి రాసిన ప్రయాణం కథ ఇదే విషయాన్ని చెబుతుంది. ఇందులోని కథానాయిక రమ మనోవేదన మనసుని ఆర్ద్రం చేస్తుంది. మనిషికి ఏర్పడిన వత్తిడి బహిరంగమైన నిర్బంధమే కాకుండా ఆంతరంగికమైననదైనప్పుడు లోతైన దెబ్బ తగిలి ఎవరికైనా చెప్పుకోవాలి అనిపించడం సహజం.

మనసులో భీకర సత్యాన్ని దాచుకుని ప్రేమించిన వ్యక్తితో జీవితం పంచుకోలేక మనసారా ప్రేమించిన మనిషి తన మనోవేదనను అర్థం చేసుకుని తనను లాలిస్తాడనుకోవడం పొరపాటే. తననొక వ్యక్తిగా గుర్తించి గౌరవించగల సహచరుని కోసం వెతకడం అత్యాశ కాదు. “చూడగానే కలిగే భావం ప్రేమ కాదు. పైపై పరిచయాలతో ఏర్పడే స్నేహమూ ప్రేమ కాదు. ఏదో ఒక ధ్యేయం పెట్టుకుని సహజీవనం చెయ్యడంలో ప్రేమ ఆవిర్భవించి క్రమక్రమంగా విస్తృతమవుతుంది. అల్పవిషయాలలో వచ్చే మనస్పర్థలకు అప్పుడు విలువ ఉండదు. అటువంటి ప్రేమ అన్ని ఒడిదుడుకులకూ తట్టుకోగలుగుతుంది.” అని ఈ కథలో శేఖరం చెప్పే మాటలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి.

ఇటువంటి మాటలనే మూర్తి దగ్గరనుంచి తను ఆశించింది. కానీ అవి శేఖరం దగ్గరనుంచీ వస్తాయి. రచయిత్రి ఈ కథని 1965లో రాశారు. నలభై ఏళ్ళ తర్వాత కూడా ఈ కథ పాఠకుల్ని ఆలోచింపచేస్తుంది. ప్రేమ, పెళ్ళి, శీలం అనే విషయాల్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియచేస్తుంది. పఠిత అంతరాంతరాల్లో ఆలోచనలు రేపే విధంగా ఉన్న కథనం ఆకట్టుకుంటుంది. ఇలా కొత్త ఆలోచనల్ని అందించే కథలు అనేకం ఈ సంపుటిలో ఉన్నాయి.

పట్నవాసపు మధ్యతరగతి డ్రాయింగ్ రూములు అలంకరించే దారు శిల్పాల సంగతి కాదిది. ఏ చెట్టు నుంచో కొట్టుకొ చ్చి, వార్నీషు పూసిన కొమ్మలను చాలా డబ్బులుపసి కొని టీపాయిల మీదుంచుకుని పొందే ఆనందమలో నిజానికి ఒక పెనువిషాదం దాగి ఉంటుంది. తాజా పూలతో వుడ్‌రోజ్‌లను కలిపి వృద్ధాప్యం, యౌవనం కలిపి చూపించడం, ఉడ్‌రోజ్ పువ్వులు వృద్ధ్యాప్యానికి, తాజా గులాబీలను యవ్వనానికి ప్రతీకలన్నట్టు చిత్రించడం బాగుంది. ఉడ్‌రోజ్ తీగతో పెంచుకున్న అనుబంధాన్ని కొడుకు చీల్చి చెండాడుతుంటే తల్లి మనసు గిలగిలా కొట్టుకోవడం, మనిషికీ, మనిషికీ మధ్య మమత ఆ తీగంత దట్టాంగా పెరగకూడదేమో, మమకారంపెంచుకోవడం తన తప్పేనేమోని మధనపడటం, అల్లుకుపోవడమే కానీ, తెంచుకోవడం తెలియని మనసుపడే వేదనను ఈ కథలో చాలా హృద్యంగా చెప్పారు ఛాయాదేవి.

‘ఆఖరికి అయిదు నక్షత్రాలు’ లోని కథనం మనల్ని కలతపరుస్తుంది. ఆసుపత్రికి వెళ్ళాలంటే మనకు తెలియకుండా మనలో బతుకుభయం ఏర్పడి కలతపరుస్తుంది. ఎవరైనా ఉన్న గుండె పాడయిందని బాధపడతారా లేక కృత్రిమ హృదయం పెట్టుకున్నామని సంతోషపడతార? అవి కలిగిమచే అనుభూతిని చవిచూడాలి. కార్పొరేట్ ఆసుపత్రుల స్వైరవిహారాన్ని కళ్లకు కట్టించే కథ ఇది. వ్యవస్థీకృతమైన అపసవ్యతల్ని ప్రశ్నించే కథ ఇది.

మహిళల జీవితాల్లోని అనేక కోణాలు ఈ కథల్లో ఉన్నాయి. నాలుగు దశాబ్దాల కాలంలో అబ్బూరి ఛాయాదేవి రాసిన కథలివి. ఈ నలభై ఏళ్లలో మన సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. ఆడవాళ్ళు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడంమామూలైంది. కానీ అడవాళ్ళని మనుషులుగా చూస్తున్నారా? పురుషాధిక్య సమాజపు దృష్టి మారిందా? మారలేదు. అయితే మునుపటిలా ఆడవాళ్ళు మౌనంగా ఉండడం లేదు. ప్రశ్నిస్తున్నారు. తమ గురించి తాము సగౌరవంగా మాట్లాడుతున్నారు. తమ ఆలోచనల్ని వ్యక్తీకరిస్తున్నారు. ఇదిలా కొనసాగాలి. ఇందుకు అవసరమైన బలాన్నీ ఆత్మవిశ్వాసాన్నీ ఆడవాళ్ళకి అందిస్తాయి ఛాయాదేవి కథలు

(వార్త జనవరి 1 2006)

---

నా భావాలకు ఇచ్చిన గౌరవం ఇది

'' నా రెండో కథా సంపుటం 'తన మార్గం'కు వచ్చిన అవార్డును స్త్రీవాదానికి, స్త్రీవాద రచయిత్రులందరికీ లభించిన గౌరవంగా భావిస్తున్నాను'' అని చెప్పారు అబ్బూరి ఛాయాదేవి. స్త్రీవాద దృక్పథాన్ని ప్రతి కథలోను జీవనదిలా ప్రవహింపచేయగల సరళమైన మధ్యేమార్గాన్ని సాధన చేసి అలవరచుకున్నానని చెప్పే ఛాయాదేవి బహుశా ఆ కారణంగానే స్త్రీవాద రచయిత్రులందరిలోకి 'అజాతశత్రువు'గా అందరి మన్ననలూ పొందగలిగారేమో. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన సందర్భంగా ఆమెతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు...



'' కేంద్రసాహిత్య అవార్డు రావడం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. ఈ అవార్డు నాకు వస్తుందని నేను అసలు ఊహించలేదు. ఇది నా భుజాలపై మరింత బాధ్యతల బరువు పెట్టిందనిపిస్తోంది. ప్రశాంతంగా, ప్రచారహంగామాలకు దూరంగా ఉండడానికి ఇష్టపడే నాకు ఈ అవార్డు హడావిడి కొత్తగాను, కొద్దిగా ఇబ్బందిగాను ఉంది. అయినా ఎందరో నన్ను ప్రేమగా పలకరించి అభినందనలతో ముంచెత్తడం చూస్తుంటే వ్యక్తిగా కాకుండా నా రచనలలోని భావాలమీద వారికున్న అపూర్వమైన గౌరవం నన్ను ముగ్ధురాలిని చేస్తోంది. వారి మాటలను పదిలంగా గుండెల్లో నింపుకుంటున్నాను.

## మహిళల సమస్యలే నా కథలు...

మహిళల సమస్యలే నా కథలు. అమ్మ, అత్తయ్య, చుట్టాలు, స్నేహితులు, పొరుగువారు వీరే నా పాత్రలు. మా ఇంట్లో పరిమితులు, సంప్రదాయాలు, నియమాలు బాగా ఉండేవి. వాటివల్ల నాకు స్వేచ్ఛలేనట్టు అనిపించేది. ముఖ్యంగా బ్రాహ్మణ కుటుంబాల్లో బహిష్టు సమయాల్లో ఆడవాళ్లని బయటకూర్చోబెట్టడం నాకు అస్సలు నచ్చేది కాదు. ఎంతో కంటకంగా అనిపించేది. చదువులో, లిబరల్‌గా ఆలోచించడంలో నాపై అన్నయ్య ప్రభావం ఉంటే, రచనలు చేయడం మటుకు వదిన వల్లే. నాన్న నియంతృత్వ ధోరణే నన్ను మొదటి కథను రాసేట్టు ప్రేరేపించింది. ఆ తర్వాత అనేక కథలు రాసినా నా కథల్లో నాకు బాగా నచ్చింది 'బోన్సాయ్ బతుకు'. ఇండియన్ లిటరేచర్‌లో మాస్టర్‌పీస్‌గా వాకాటి పాండురంగారావుగారు దీనిని పేర్కొన్నారు.

## అత్తగారి ప్రోత్సాహం ఎంతో...

మా అత్తగారు నన్ను ఎంతో ప్రోత్సహించేవారు. 'సుఖాంతం' కథ చదివి ఆవిడ ' ఎంత మంది పిల్లల్ని కని కష్టపడిపోయేవు..'అంటూ జోక్ చేశారు. 'శ్రీమతి ఉద్యోగిని' కథ చదివి ఇంట్లో విషయాలన్నీ బయటకు రాసేస్తున్నావు కదా అన్నారు నవ్వుతూ. 'ప్రయాణం'కథ నాకు బాగా గుర్తింపుతెచ్చింది. "సుఖాంతం' కథ వచ్చినపుడు నన్ను 'నిద్రా రచయిత్రి' అని పేర్కొన్నవారు ఉన్నారు(నవ్వుతూ). చిన్నతనంలో వృద్ధుల గురించి రాసినవీ ఉన్నాయి. ఈ పెద్దవయస్సులో యువత గురించి రాసిన ఉన్నాయి. మానసిక పరిపక్వత, ఆత్మవిశ్వాసం వల్ల ఇలా రాయగలుగుతున్నానని అనుకుంటున్నాను. ఇప్పటివరకు నా చివరి కథ 'అదొక సంస్కృతి'.

నా రచనలను, నన్ను స్త్రీవాదులు తమలో కలుపుకున్నారు. ఇది నాకు ఎంతో సంతోషకరమైన, గర్వించదగ్గ విషయం. నేను

స్త్రీవాదినని చెప్పుకోవడానికి భయపడను. ఫెమినిస్టులలాగ రాయలేను కాని నా స్త్రీవాద దృక్పథాన్ని ప్రతి కథలోనూ జీవనదిలా ప్రవహింపచేయగల సరళమైన మధ్యేమార్గాన్ని మొదటినుంచీ సాధనచేశాను. చెప్పదలచుకున్న విషయాన్ని పరుషంగా కాకుండా షుగర్‌కోటెడ్‌గా చెప్పడం అలవాటుచేసుకున్నాను.

### ఆయన దగ్గర భాష నేర్చుకున్నాను

ఏదైనా ఐడియా వస్తే కొన్నాళ్లు మనసులోనే ఆలోచించడం నా అలవాటు. ఆ తర్వాత ఒకేసారి కథ మొత్తాన్ని పూర్తిచేసేదాన్ని. అలా ఒకేపెట్టున కూర్చుని రాస్తుండడం చూసి ఆయన విసుక్కునేవారు. భాష విషయంలో వరదరాజేశ్వరరావుగారి దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. కథలు ఏవి రాసేటప్పుడైనా ఇంగ్లీషు మాటలు వాడడం ఆయనికి అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఈ విషయంలో నేను చాలా జాగ్రత్తగా వ్యవహరించేదానిని. తెలుగులో ఆలోచించి తెలుగులో రాస్తారు... అంటూ నాకు కితాబిచ్చినవారున్నారు.

ఆయన మరణించిన తర్వాత బయటకు రాగలిగాననే అభిప్రాయం తప్పు. ఉద్యోగానికి నేను ఎంతో ప్రాధాన్యం ఇచ్చాను. ఇంటి బాధ్యతలూ ఉండేవి . ఆయనకు ఏమి ఇబ్బంది వస్తుందోనన్న ఆలోచన... అన్నింటికీ మించి అపరమితమైన ప్రేమతో ఆయన నన్ను కట్టిపడేశారు... ఇవన్నీ బయట కార్యక్రమాలకు వేటికీ హాజరుకాలేకపోయేట్టు చేశాయి. ఆయన మరణించిన తర్వాత కూడా బయటకు రావాలన్న దృష్టి నాకు లేదు. కాని నా స్నేహితులు నన్ను బయటకు వచ్చేట్టు చేశారు.

### రావిశాస్త్రి , ఓల్గాలు ఇష్టం...

సాహిత్యప్రక్రియల్లో నాకు కథ ప్రీతికరమైంది. చేతనైంది. వ్యాసరచన కూడా ఇష్టం. ఇందులో విషయాన్ని డైరక్ట్ స్పీచ్‌లో సరళంగా, సూటిగా, చెప్పొచ్చు. నా రచనలయితే కథా సంపుటాలు, వ్యాసచిత్రాలు, చైనా ఛాయాచిత్రం(ట్రావలోగ్), స్టెఫాన్ జ్వీగ్ జర్మన్ కథలకు తెలుగు అనుసరణ , మృత్యుంజయ (ఓ తండ్రి కథ), జిడ్డుకృష్ణమూర్తి రచనల అనువాదాలు వచ్చాయి. జిడ్డుకృష్ణమూర్తిమీద ఆసక్తి, ఇష్టం మా నాన్నగారి వల్ల ఏర్పడ్డాయి. మానవసంబంధాల గురించి, నిత్యజీవితం గురించి ఆయన రచనలు సాగుతాయి. మానవ మనస్తత్వ పరిశీలనకు ఆయన రచనలు నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఎదుటివాళ్లని అర్థంచేసుకునే గుణాన్ని ఆయన రచనల ద్వారా పెంపొందించుకోవచ్చు. నాకిష్టమైన రచయిత రావిశాస్త్రి. ఇప్పటివారిలో ఓల్గా. నా భవిష్యత్ కార్యక్రమం అంటే నానుంచి ఆశించిన వాటిని బాగా చేయడానికి ప్రయత్నించడమే...''